# ధన్ బహదూర్ చేతికర్ర



నేపాలీ మూలం:
సమీరణ్ ఛేత్రీ 'ప్రియదర్శి'

తెలుగు సేత:
ఎండ్లూరి సుధాకర్

నేపాలీ కథ

బ్యాంకు నుంచి పెన్షన్ తీసుకొని ధన్‌బహదూర్ తన చేతికర్రను టకటక లాడిస్తూ మెట్లు దిగుతుంటే పించనుదారులందరూ అతడివైపు రెప్పలు వాల్చకుండా చూస్తూ వుంటారు.

డెబ్బై యెనిమిది వసంతాలను చూశాడు ధన్ బహదూర్. ఒక విచిత్రమైన రీవితో నడుస్తాడు. సంతోషం కూడా ఒక వస్తువే. ఎందుకంటే అతడు పెన్షన్ తీసుకోవడం మొదలుపెట్టి యిరవైయేళ్లు గడిచిపోయాయి. అతడి చేతిలోకి ఈ కర్ర వచ్చి కూడా నలభైయేళ్లకు పైనే అయ్యింది. ముప్పయ్యేనిమిదేళ్ల పడుచు వయసునుంచే ఈ ఊతకర్రను ఉపయోగించేవాడు. ధన్ బహదూర్ కుంటివాడు కావటం చేత ఈ కర్రను ఉపయోగిస్తున్నాడనుకుంటే పొరబాటు పడినట్లే. ఈ కర్రతో అనుబంధం పెంచుకోవడం వెనుక ఒక కథ వుంది. ఆ కథే అతడి చేతిలోని ఊతకర్రను నడిపించే బాధ్యత తీసుకుంది.

రెండో ప్రపంచయుద్ధ కాలంలో 'సింహమారీ' ప్రాంతంలో ఫాదర్ సబుల్ అనే జర్మన్ మిషనరీ వుండేవాడు. అతడు స్వదేశానికి తిరిగి వెళ్లాల్సిన సమయం వచ్చింది. అప్పుడు తన దగ్గరుండే వస్తువుల్ని పనివాళ్లకు పంచిపెట్టాడు. ఆ పంపకాల్లోనే ఈ చేతికర్ర ధన్ బహదూర్ వాటాలోకి వచ్చిపడింది.

ధన్ బహదూర్ని చాలామంది పిచ్చోడని అనుకుంటారు. ఎందుకంటే అతడి నోటివెంట ఎప్పుడు చూసినా ఈ ఊతకర్ర కీర్తిగానం వినిపిస్తూ వుంటుంది. ఏదిఏమైనప్పటికీ వేలాది కర్రలకు భిన్నంగా వుండే చారిత్రాత్మకమైన ఊతకర్ర అతడిది. పించనుదారుల మధ్య ధన్ బహదూర్ హీరోలాంటివాడు. అతడు మాట్లాడినంత చలాకీగా మరెవ్వరూ మాట్లాడలేరు. అతడు మాట్లాడే తీరు కూడా విలక్షణంగా వుంటుంది. అతడు ట్రెజరీలోకి అడుగుపెడితే చాలు, పించనుదారులందరూ అభివాదం చేస్తారు. ధన్‌బహదూర్ పెన్షన్ తీసుకొని తిరిగి వెళ్లిపోతున్నప్పుడు అందరి కళ్లూ సర్పాకారంలో వుండే ఆ పొన్నుకర్ర మీదే వుంటాయి. నిజానికి ఆ ఊతకర్ర ధన్‌బహదూర్ లేకుండా నడవలేదు. అలాగే ధన్‌బహదూర్ కూడా ఈ ఊతకర్ర తోడులేకుండా ఒక్క అడుగుకూడా వేయలేదు.

ఈ కర్ర 'ఇడింగ్‌టన్ గ్లాసు ఫ్యాక్టరీ' యజమాని ఇడింగ్‌టన్ గారిది. ఆయనొక పర్యాయం డార్జిలింగ్ పర్యటనకు వచ్చినపుడు ఫాదర్ సబుల్ గారికి కానుకగా ఇచ్చాడు. ధన్ బహదూర్ ఏమంటాడంటే తన ముప్పయ్యెనిమిదేళ్ల వయసులో పెద్దకొడుకు పుట్టినపుడు యిదే చేతికర్ర ఆసరాతో కొండమీదుండే ఆసుపత్రికెళ్లి ప్రసూతి గదిలోని కొడుకుని చూశాడట. ఇది భలే విషయం. ఇంతకూ ఈ చేతికర్ర ఇడింగ్‌టన్ గారికి ఎలా వచ్చింది?! ఒకసారి ఇడింగ్‌టన్ కలకత్తా వెళ్లాడు. గవర్నర్ దొరసానికి తన ముఖదర్పణం చూపించడానికి. ఆయన కుంటుతూ నడవడం గవర్నర్ దొరసాని గమనించి ఈ ఊతకర్రను బహూకరించింది. ధన్ బహదూర్ ఎప్పుడూ ట్రెజరీలోని పొడవైన బెంచీమీద కూర్చునేవాడు. అక్కడే తన కర్ర గురించీ రకరకాల కథలు వినిపించేవాడు. ఏం చెప్పేవాడంటే, తను యువకుడిగా వున్నప్పుడు మౌంట్ హర్మన్ కాలేజీలోని అందమైన అమ్మాయిలు తన రూపాన్ని చూసి దంగైపోయేవారని చెప్పేవాడు. ఒకసారి ఒక అమ్మాయి తనని ఇంగ్లాండుకు లేవదీసుకొని పోతానని చెప్పిందట. అతని నవనవలాడే దేహదారుఢ్యాన్ని చూసి విదేశీ యువతులు గ్రహపురాణాల్లోని దేవత

ల్తో పోల్చేవారట. ఒక పిల్లయితే ఏకంగా అతణ్ణి 'అపోలో' అని పిలిచేదట. నల్లని మీసకట్టు మొలుస్తున్న దశలో అయితే అమ్మాయిలు అశేషంగా ఆకర్షణకు లోనయ్యే వారట. ఎందరో సుందరాంగులు ఈగల్లాగా అతని చుట్టూ మూగేవారట. ఇలా వుండేవి ధన్ బహదూర్ కబుర్లు. దాంతో పించనుదార్లందరూ అతనివైపూ, అతని కర్రవైపూ సమ్మోహితులయ్యేవారు.

ధన్ బహదూర్ ఏమంటాడంటే మాజీ గవర్నర్ దొరగారు ఈ కర్రను విదేశాల నుంచి తెప్పించాడట. ఆయన లండన్‌లో వుంటున్నప్పుడు యెవరో ఒక యూదు వ్యవసాయదారుడు తనకు కౌలుదారి పని యిప్పించినందుకు కృతజ్ఞతగా గవర్నర్‌గారికి ఈ కర్రను నజరానాగా యిచ్చాడట. ఆ యూదుడికి కూడా ఈ కర్ర అక్టోబర్ విప్లవంలో మాస్కోనుంచి పారిపోయి వస్తున్న జార్ యువరాజు దగ్గరున్న ముసలి యూదుడి వద్ద లభించిందట. అని యిలా చెప్పుకొచ్చేవాడు. గమనించాల్సిన విషయం ఏమంటే ఆ కర్ర చివర్లో చిన్నచిన్న చెక్కిన అక్షరాలతో 'జి.డబ్లు.గోథే – 1760' అని రాసి వుంది. దీంతో నిశ్చయంగా తెలిపోయే అంశం యేమిటంటే ఈ కర్రను ప్రఖ్యాత జర్మను కవి గోథే ఉపయోగించాడని రుజువయ్యింది. అందుకే ఇడింగ్‌టన్ గారు కూడా దీన్ని గోథే చేతికర్రగా గుర్తించి జర్మను ఫాదర్ సబుల్ గారికిచ్చాడు.

ధన్ బహదూర్ చేతికర్ర సదా ఆయన వెంటే వుంటుంది. ఎక్కడికెళ్లినా దాన్ని వెంట తీసుకెళతాడు. దానికో గొప్ప చరిత్ర వుంది. రష్యా అక్టోబర్ విప్లవాన్నీ, సెయింట్ పీటర్స్‌బర్గ్ నుంచి వెలువడే 'ప్రావ్దా' పత్రికనీ, ఇడింగ్‌టన్ గ్లాసు ఫ్యాక్టరీ లాకౌట్‌నీ ఇంకా ఎన్నింటినో ఈ కర్ర కళ్లారా చూసింది.

మనకు అత్యంత ప్రీతికరమైన వస్తువు పోయినపుడు దానిమీద పదింతల ప్రేమ పుడుతుంది. ఒక్క క్షణంముందు ధన్ బహదూర్ చేతికర్ర చేతిలో వుంది. యిప్పుడు మాత్రం లేదు. కర్ర చేతిలో లేకపోవడంతో కర్రతో ముడివడిన సుఖదుఃఖాల కథలెన్నో ఏకధారగా ఫ్లాష్‌బ్యాక్‌లాగా గుర్తుకొస్తున్నాయి. ఒక పుస్తకాల షాపు దగ్గర కర్రను ఒక మూల భద్రంగా వుంచి ధన్ బహదూర్ పత్రికల్ని తిరగేస్తున్నాడు. ఒక పత్రికలో ఆసక్తికరమైన విచిత్రకథనం కనబడింది. దాన్ని చూడగానే కళ్లద్దాలు తీసి ఆ రచన చదవడంలో పూర్తిగా లీనమైపోయాడు. 'ప్రపంచంలో ఎక్కువ కాలం జీవించిన మనిషి' అలా చదువుకుంటూ వెళ్తున్నాడు. 'ప్రపంచంలో దీర్ఘకాలం జీవించిన మనిషి టిబెట్‌కు చెందిన 'యుంగ్ గియాన్'. ఆయన రెండువందల యాభై రెండు సంవత్సరాల వయసులో మరణించాడు. 'మొంపూ' అనే పేరుగల రెండువంద నలభై రెండు సంవత్సరాల జపాను రైతు తన ఊళ్లోని కొత్త పూల ప్రదర్శన ప్రారంభోత్సవం చేయడానికి తన వెంట రెండు వందల సంవత్సరాల వయసున్న కొడుకుని తీసుకెళ్లాడు. ఇంగ్లాండులో 'థామస్ కోర్నే' అనే వ్యక్తి రెండువందల యాభై సంవత్సరాలు బతికాడు.

సోవియట్ యూనియన్‌లో 'సిరాలో మిస్ మిలమ్' అనే నూటాఅరవై ఐదు యేండ్ల ముసలివాడు, అదే వయసున్న 'సమేద్ ఆకుతాలేమ్' అనే మరో మనిషి ఇరాన్‌లో ఇంకా జీవించే వున్నారు.' ధన్ బహదూర్‌కు ఈ సంగతులు గొప్ప ఆనందాన్ని కలిగించాయి. పత్రిక కొన్నాడు. కర్రను పట్టుకుందామని చెయ్యి అటు వైపు పోనిచ్చేసరికి చకితుడయ్యాడు. అక్కడ కర్ర లేదు. కర్ర మాయమయ్యింది. పిచ్చివాడిలాగా అక్కడా యిక్కడా అంతటా వెదకటం ప్రారంభించాడు. చివరికి నిరాశే చేతికి తగిలింది. అతడి చిరకాల నేస్తం – ఊతకర్ర లేకపోవడంతో ఆ లోటు భరించలేక పోతున్నాడు. ఉదాసీనంగా వుండిపోయాడు. చివరికి అతడు మాత్రం ఏం చేస్తాడు ? నిరాశతో గమ్మున యింటి ముఖం పట్టాడు.

కర్ర పోయిన వార్త యింట్లో వాళ్లకి తెలిసిపోయింది. అందరూ పుట్టెడు దుఃఖంలో మునిగిపోయారు. చిన్న కొడుకు చంద్ర షంశేర్ తండ్రి దగ్గర కూర్చుని అనునయంతో యిలా అన్నాడు. "నాన్నగారూ! మీరు దుఃఖపడకండి. చివరికి అన్నీ పోవలసిందే కదా! అందుకే అది కూడా పోయింది. నేను పోతాను, మీరు పోతారు, ఈ యిల్లు పోతుంది. మీ కోడలుకూడా పోతుంది. అమ్మ ఎలాగైతే వెళ్లిపోయిందో! ఈ మహానదిలో గాలితో కలిసి మనమంతా వెళ్లిపోవాల్సిందే! దయచేసి భోంచేయండి. ఇలా ఎన్ని రోజులు గడుపుతారు"

ధన్ బహదూర్ మనసు విచలితమైపోయింది. దుఃఖం వుబుకుతోంది. కళ్లనీళ్లు పెట్టుకొని కొడుకువైపు చూస్తూ ఏదేదో గొణుగుతున్నాడు. కాని చంద్ర మాత్రం ఏమీ వినలేదు. ధన్ బహదూర్ చీకటి గదిలో ముడుచుకొని పడుకున్నాడు. ఎప్పుడూ పారాయణం చేసే రామాయణం చదవలేదు. దాన్ని చుట్ట చుట్టి దిండుకింద పెట్టుకున్నాడు. రామాయణం తల కింద పెట్టేశాక ఒక్కడే లోలోన మాట్లాడుకుంటున్నాడు. ఈ దేవుళ్లూ! ఈ శాస్త్రాలూ! ఈ తీర్థాలూ! ఈ వ్రతాలూ అన్నీ దండగమారి పనులు. ఇవన్నీ పచ్చి అబద్ధాలు. కేవలం అబద్ధాలు.

*** ***

ధన్ బహదూర్ తనకు తానే ఒక దోషిగా భావించుకున్నాడు. మెల్లగా అటు ప్రక్కకు తిరిగాడు. గెడ్డం ఫాదర్ సబుల్ తన కర్ర యివ్వమని అడగటానికొచ్చాడు. అతని కళ్లల్లోంచి వేలాది కర్రలు పాములుగా మారి కాటువేయడానికి బుసలు కొడుతున్నాయి. ధన్యుడు కాబట్టి అక్కడో యిల్లుంటే ఆ యింటి కప్పు మీద కెక్కి కాపాడుకున్నాడు. అతని ముద్దుల చేతికర్ర ఆదిశేషువుగా మారి స్వర్గం వైపు ఎగిరిపోతోంది.

*** ***

తెల్లారి తండ్రీ కొడుకులిద్దరూ కల్సి పోలీసు స్టేషనుకెళ్లి కర్ర పోయిన సంగతి రిపోర్టు రాసిచ్చారు. చాలా రోజులు గడిచాయి. కర్రమాత్రం చేతిలోకి రాలేదు. కర్ర పోయిన విచారంలో ధన్ బహదూర్ జబ్బున పడ్డాడు.

'ఏదో ఒక రోజు అన్నీ పోవలసిందే!' ఇలా మనసులోనే అనుకుంటూ వుంటాడు.

"కానీ నేను వున్నంత వరకైనా ఆ కర్ర నా చేతిలో వుండకపోతే ఎలా?" ఏది ఏమైనా చివరికి చేతికర్ర దొరికింది. పోలీస్‌స్టేషనుకెళ్లి తన కర్ర తెచ్చుకున్నాడు. కర్ర దొరికింది గానీ ధన్ బహదూర్‌కు ధన్ బహదూర్ దొరకలేదు. అతడు రోజు రోజుకీ కృశించిపోతున్నాడు.

ఒక రోజు ఒక పార్శీ వాలా ధన్ బహదూర్‌ని వెతుకుతూ వచ్చాడు. పొద్దుటెండలో ధన్ బహదూర్ శరీరాన్ని వెచ్చచేసుకుంటున్నాడు. ఊళ్లో వాళ్లంతా చకితులయ్యారు. ధన్ బహదూర్ యింటికి ఒక పార్శీ బాబు వచ్చాడని ఆ నోటా యీ నోటా మొత్తం పూరంతటికీ విషయం తెల్సిపోయింది. ఆ పార్శీ ధనవంతుడు ధన్ బహదూర్ చేతికర్రను కొంటానికి వచ్చాడని.

"ఎలా తెల్సింది పార్శీ బాబుకు ఈయన చిరునామా"

"ధన్ బహదూర్ చేతి కర్ర ఒక చారిత్రాత్మకమైన విచిత్రం"

"ఇంతకూ యిందులోని మర్మమేమిటి ?"

యిలాంటి మాటలు వూరంతా చెప్పుకుంటున్నారు. ఒక గమ్మత్తయిన కోలాహలం అలుముకుంది. ఆ పార్శీ బాబు చేతికర్ర ఖరీదు లక్షరూపాయలకు వెలకట్టాడు. అయినా ధన్‌బహదూర్ ఆ కర్రను అమ్ముకోడానికి ససేమిరా ఇష్టపడలేదు. అతని యిద్దరు కొడుకులు అర్ధరాత్రి వరకూ తండ్రితో మాట్లాడారు. ప్రయత్నం విఫలమైంది. రాజీ కుదరలేదు. నాన్నను చూడడానికి కలకత్తా నుంచి వచ్చిన కూతురు అక్కడే వుండిపోయింది. అందరూ ఊతకర్రను అమ్మేయాల్సిందేనని ఉమ్మడిగా పట్టుబట్టి కూర్చున్నారు. కూతురు కూడా తండ్రికి అన్నివిధాలా నచ్చ చెప్పింది. కానీ ధనబహదూర్ మాత్రం చేతికర్రనమ్మనని మొండి పట్టుతో వున్నాడు. కోడళ్లిద్దరూ మామగారిని ప్రసన్నం చేసుకోవడానికి రకరకాల ప్రయత్నాలు చేయడంలో మునిగిపోయారు. పొద్దున్నే వంట పనులు చేసుకొనే సమయంలో కోడళ్లిద్దరూ చెరో ఏభైవేలు పంచుకొని ఏయే వస్తువులు కొనాలోనని లెక్కలేసుకుంటున్నారు. ధన్ బహదూర్ మాత్రం రవ్వంత కూడా చలించలేదు. చివరికి పార్శీ బాబు ఓటమిని ఒప్పుకున్నాడు. తిరిగి వెళ్లిపోతూ అన్నదమ్ముల చెవుల్లో ఒక మాట విడిచి పెట్టిపోయాడు.

ఈసారి ధన్‌బహదూర్ పెన్షన్ తీసుకోడానికి ట్రెజరీ ఆఫీసుకు వెళ్లలేకపోయాడు. పొద్దున్నే చిన్న కోడలు 'టీ' ఇవ్వడానికి ఆయన గదిలోకి వెళ్లింది. ధన్‌బహదూర్ ఊపిరి పీల్చలేకపోతున్నాడు. నోట్లోంచి మాటకూడా రావడం లేదు. చంద్ర షంశేర్ గాభరా పడుతూ డాక్టరును పిలుచుకు రావడానికి ఉద్యుక్తుడవుతుంటే, ధన్‌బహదూర్ సైగలతోనే కొడుకును పిలిచాడు. ఇప్పుడు డాక్టరుని తేవడం కంటే లాయర్‌ని తీసుకురావడం మంచిదని అతి కష్టం మీద చెప్పగలిగాడు. వకీలొచ్చాడు. గదిలోంచి అందరూ బయటకెళ్లిపోయారు. లాయరూ ధన్‌బహదూర్ చాలా సేపు ముచ్చటించుకున్నారు. ధన్‌బహదూర్ తన ఆస్తంతా పంపకానికి పెట్టి వీలునామా సిద్ధం చేయించాడు. ఇల్లూ, పొలమూ, బ్యాంకు నిలవున్న డబ్బూ ఇద్దరు కొడుకులకూ, కూతురికీ ఎవరికెంత దక్కాలో రాసిపెట్టాడు...అయితే అందరికీ ఊత కర్ర గురించే విశేషమైన ఉత్సుకతగానూ, ఉద్విగ్నంగానూ వుంది. చివరికి వకీలు చెప్పాడు.

**"దయచేసి మీరెవరూ అపార్థం చేసుకోవద్దు. మీ తండ్రిగారు తన చేతికర్రను తనతోపాటే చితిలోకి రావాలని కోరుకున్నాడు."**

ఈ మాటలు వినగానే కొడుకులిద్దరూ విసురుగా ఆయన గదిలోకి దూసుకెళ్లారు. అప్పటికే ఆయన ఈ ప్రపంచానికి వీడ్కోలు పలికాడు. మంచం మీదుగా జారి చేతికర్ర నేలమీద పడిపోయింది.